క్లుప్తంగా

అబ్దుల్ కలాంకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్

జహీరాబాద్ టౌన్: బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. డీసీఎంఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ శివకుమార్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, టీఎస్ఐడీసీ చైర్మన్ తన్వీర్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ పెంటారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, సర్పంచ్‌లు, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం జయంతిని ఆదివారం ఖేడ్‌లోని ఆక్సిజన్ పార్కు ఆవరణలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఖేడ్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇండోర్ షటిల్ టోర్నమెంట్



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని రంజోల్ వద్ద గల ఎరినా స్పోర్ట్స్ జోన్ నిర్వాహకులు ఆదివారం ఇండోర్ షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో 30 జట్లతోపాటు పోలీసులు, ట్రాన్స్‌కో తదితర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. జైపాల్ టీం(పోలీస్) టోర్నమెంట్ విన్నర్‌గా నిలిచింది. సతీష్ టీం (ట్రాన్స్‌కో) ద్వితీయ బహుమతి, జీవీఎస్ టీం తృతీయ బహుమతులు గెలుచుకున్నాయి. విజేతలకు జ్ఞాపికతో పాటు నగదు బహుమతి అందజేశామని నిర్వాహకుడు ప్రవీణ్ తెలిపారు.

ముగిసిన జోనల్ స్థాయి పోటీలు



క్రీడాకారులతో గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ కళ్యాణి

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని గిరిజన గురుకుల పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న 7వ జోనల్ స్థాయి ఆటల పోటీలు ఆదివారంతో ముగిశాయి. జోనల్ పరిధిలోని 14 గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు గురుకులాల రీజనరల్ కోఆర్డినేటర్ కళ్యాణి, ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా గురుకులాల రీజనరల్ కోఆర్డినేటర్ కళ్యాణి మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.

కార్మికులకు పరామర్శ



చికిత్స పొందుతున్న కార్మికులతో మాట్లాడుతున్న నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్/జిన్నారం: బొల్లారం పారిశ్రామికవాడలోని అమర లాబ్స్ లో ప్రమాదవశాత్తు రియాక్టర్ల పేలి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు నీలం మధు ముదిరాజ్ ఆదివారం పరామర్శించారు. గాయపడ్డ క్షతగాత్రులను పరామర్శించి తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు గాయపడ్డ కార్మికులకు మెరుగైన వైద్యచికిత్స అందించాలని డాక్టర్లను కోరారు. పరిశ్రమ యాజమాన్యాలు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

తుల్జాపూర్ క్షేత్రానికి పాదయాత్ర

ఝరాసంగం(జహీరాబాద్): దసరా పండగను పురస్కరించుకుని మహారాష్ట్రలో కొలువైన తుల్జాపూర్ భవాని మాతను దర్శించుకునేందుకు పాదయాత్రగా భక్తులు తరలివెళ్లారు. ఆదివారం ఝరాసంగంలోని కేతకి సంగమేశ్వర ఆలయంలో పూజలు చేసి బయలుదేరారు. 250 కిలోమీటర్ల పాదయాత్ర ఐదు రోజుల పాటు కొనసాగుతుందని అమ్మవారి భక్తులు తెలిపారు.

దేవీశరన్నవరాత్రులు ప్రారంభం

దేవీశరన్నవరాత్రులు ఆదివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు బాలా త్రిపుర సుందరిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాటుచేసిన మండపాల్లో ప్రజాప్రతినిధులు, మహిళలు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువకులు అమ్మవారి దీక్షలు తీసుకున్నారు. ఝరాసంగంలోని కేతకి సంగమేశ్వర ఆలయంలో దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారు మంగళగౌరిగా దర్శన మిచ్చింది.



సదాశివపేటలో జై భవానీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో పూజలు చేస్తున్న రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ సతీమణి చింతా అరుణ



మునిపల్లి: బుదేరా శివాలయంలో అమ్మవారు



పటాన్‌చెరు టౌన్: రేణుక ఎల్లమ్మఆలయంలో..



జిన్నారం(పటాన్‌చెరు): బాలా త్రిపురాసుందరి దేవిగా భద్రకాళీ అమ్మవారు



కల్హేర్: బాలా త్రిపురసుందరి దేవిగా భవానీ మాత



సంగారెడ్డిలో దుర్గాదేవిగా వాసవీ మాత



మనూరు: అమ్మవారి సన్నిధిలో ఆర్టీసీ అధికారులు

అభివృద్ధి మా నినాదం.. సంక్షేమం మా విధానం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- అమీన్‌పూర్ మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారం ప్రారంభం



ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

పటాన్‌చెరు: కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమం మరింత కొనసాగాలంటే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీని నిండు మనస్సుతో ఆశీర్వదించి, హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని వెదిరి టౌన్ షిప్, హెచ్ఎంటీ కాలనీల్లో బీఆర్ఎస్ పార్టీ ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా వెదిరి కాలనీలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. పదేళ్లలో అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో చేసిన ప్రగతిని వివరించారు. నవంబర్ 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో కారు గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, కౌన్సిలర్లు కల్పన, రాజేశ్వరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్ వాగ్దానాలను ప్రజలు నమ్మరు

కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్

జహీరాబాద్ టౌన్: అధికారంలోకి వచ్చేందుకు సీఎం కేసీఆర్ ఇచ్చిన మోసపూరిత వాగ్దానాలను ప్రజలు నమ్మరని మాజీ మంత్రి, కాంగ్రెస్ అభ్యర్థి, నియోజకవర్గం ఇన్‌చార్జి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మొగుడంపల్లి మండలంలోని మాడ్గి, ధన సిరి, గౌసాబాద్, ఔరంగనగర్, గుడ్‌పల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తుంటే, కాంగ్రెస్ పేదల సంక్షేమం కోసం ఆలోచన చేస్తుందన్నారు. జహీరాబాద్ ప్రాంతంలో కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి మాత్రమే కనిపిస్తుందన్నారు. తనను గెలిపిస్తే సిద్దిపేట, గజ్వేల్ తలదన్నే రీతిలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎంపీటీసీ సభ్యుడు కిషన్ రాథోడ్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



బుదేరాలో ఇంటింటి ప్రచారంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మునిపల్లి(అందోల్): మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహను గెలిపించాలని మాజీ ఎంపీపీలు బుదేరా రాజేశ్వర్‌రావు, తాటిపల్లి రాంరెడ్డి, పార్టీ మండల నాయకులు, సర్పంచ్ గౌరమ్మ ప్రజలను కోరారు. ఆదివారం మండలంలోని బుదేరా, ఇబ్రహీంపూర్ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అధికారంలోకి వస్తే కాంగ్రెస్ అమలు చేసే సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అసత్‌పటేల్, మాజీ ఎంపీటీసీలు మనోహర్ యాదవ్, సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీ పాండు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పటాన్ చెరు: కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే తమ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ తులసివనం కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధారాణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల జోష్



కల్హేర్: సంబరాల్లో బీఆర్ఎస్ నాయకులు

మునిపల్లి(అందోల్): బడుగు, బలహీన వర్గాలకే కాకుండా అన్ని వర్గాల సంక్షేమం కోసం బీఆర్ఎస్ మేనిఫెస్టోను సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టారని బీఆర్ఎస్ యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయి కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని మునిపల్లిలో బీఆర్ఎస్ మేనిఫెస్టో విడుదల చేసిన సందర్భంగా టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారన్నారు. అలాగే చంటి క్రాంతికిరణ్ రెండోసారి ఎమ్మెల్యేగా గెలవబోతున్నారని జోస్యం చెప్పారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీఆర్ఎస్ మేనిఫెస్టో విడుదల చేసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి బీ ఫామ్ ఇచ్చిన సందర్భంగా ఆదివారం జాతీయ రహదారిపై కార్పొరేటర్లు పుష్ప నగేష్, సింధు ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. టపాసులు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు.

జిన్నారం(పటాన్‌చెరు): పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ టికెట్‌ను మహిపాల్‌రెడ్డికి సీఎం కేసీఆర్ కేటాయించి, బీఫారంను అందించటంతో జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో నాయకులు ఆదివారం సంబరాలు జరుపుకున్నారు.

సదాశివపేట(సంగారెడ్డి): సీఎం కేసీఆర్ ఆదివారం విడుదల చేసిన బీఆర్ఎస్ మేనిఫెస్టోలో ఎవరూ ఊహించని విధంగా ప్రజా సంక్షేమ పథకాలు పొందుపరిచారని బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం టాపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు.

మనూరు(నారాయణఖేడ్): మనూరు మండల కేంద్రంలో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టో విడుదల చేయడంతో నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు విఠల్‌రావు ఆధ్వర్యంలో టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. మూడోసారి భూపాల్‌రెడ్డి గెలుపొందుతారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొంగరి జయశ్రీ, రైతుబంధు కన్వీనర్ జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు: సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ మేనిఫెస్టో విడుదల చేసి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి బీ ఫారమ్ ఇచ్చిన సందర్భంగా అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ పాండు రంగారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు.

వాహనాల తనిఖీ ముమ్మరం



హత్నూరలో వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

హత్నూర(సంగారెడ్డి): ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వాహనాల తనిఖీ ముమ్మరం చేసినట్లు నర్సాపూర్ నియోజకవర్గ ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ సురేందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన హత్నూరలో ఫ్లయింగ్ స్క్వాడ్ సుధాకర్ బృందం ఆధ్వర్యంలో ముమ్మరంగా పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. రూ.50 వేలకు పైగా నగదు తీసుకెళ్లేవారు అందుకు సంబంధించిన ఆధారాలు చూపాలన్నారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

మునిపల్లి(అందోల్): ప్రజలు ఎన్నికల నిబంధనలు పాటించాలని అందోల్ నియోజకవర్గ ఫ్లయింగ్ స్క్వాడ్ హరినందన్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని గోపులారం, పొల్కంపల్లి, గొర్రెగట్టు, కంకోల్ టోల్‌గేట్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్ జెండా ఆవిష్కరణ



జెండాను ఆవిష్కరిస్తున్న డీఎం మల్లేశయ్య

నారాయణఖేడ్: ఖేడ్ ఆర్టీసీ డిపోలో గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్ జెండాను డిపో డీఎం మల్లేశయ్య ఆవిష్కరించారు. ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా డీఎం మల్లేశయ్య మాట్లాడుతూ ఆర్టీసీ అధికారులు, సిబ్బంది వంద రోజులు చాలెంజ్‌గా తీసుకుని ప్రమాణికులకు మెరుగైన సేవలు అందించి ఆర్టీసీ ఆదాయం పెంచాలన్నారు. కార్యక్రమంలో మెకానికల్ ఇంజనీర్ దశరథరావు, డిపో అధికారులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

జహీరాబాద్ టౌన్: మైనార్టీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారని తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్ఐడీసీ) చైర్మన్ ఎండీ తన్వీర్ అన్నారు. పట్టణంలోని ఫరీద్ నగర్ కాలనీకి చెందిన మైనార్టీ యువకులు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. గత ప్రభుత్వాలు మైనార్టీలను ఓటు బ్యాంక్‌గానే చూశాయన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం పాల్గొన్నారు.

నగర సంకీర్తన

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని నాగులకట్ట ప్రాంతంలో ఆదివారం నగర సంకీర్తన నిర్వహించారు. హరేరామ హరేకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో మాణిక్‌ప్రభు, బసవేశ్వర మందిర ప్రాంతంలో సుమారు రెండు గంటల పాటు ఈ కార్యక్రమం జరిగింది. భగవద్గీత, రామాయణం ప్రాముఖ్యతపై నగర సంకీర్తన కొనసాగింది. నగర సంకీర్తలో భక్తులు భజనలు చేస్తూ కీర్తనలు పాడారు.

సంక్షేమమే ధ్యేయంగా పాలన

కల్హేర్(నారాయణఖేడ్): రైతు సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేసిందని డీసీపీబీ డైరెక్టర్ గుండు వెంకట్‌రాములు అన్నారు. ఆదివారం సిర్గాపూర్ మండలం బొక్కస్‌గాంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సహకారంతో పీఏసీఎస్‌ను అభివృద్ధి చేశామన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఘనంగా శౌర్య జాగరణ యాత్ర

జహీరాబాద్ టౌన్: విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ జహీరాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం శౌర్య జాగరణ యాత్రను నిర్వహించారు. పట్టణంలోని నాగులకట్ట మాణిక్‌ప్రభు మందిరం నుంచి భవానీ మందిరం వరకు కొనసాగింది. కార్యక్రమంలో బర్దీపూర్ ఆశ్రమ భావి పీఠాధిపతి డాక్టర్ సిద్దేశ్వర్, న్యామతాబాద్ విశ్వనందగిరి మహారాజ్, బీజేపీ నాయకుడు ఢిల్లీ వసంత్, పట్టణ ప్రముఖులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారి అనుగ్రహంతో ఏదైనా సాధించొచ్చు

- ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపకుడు నీలం మధు ముదిరాజ్



అమ్మవారి పూజల్లో పాల్గొన్న నీలం మధు

పటాన్‌చెరు టౌన్: అమ్మవారి అనుగ్రహం ఉంటే ఏదైనా సాధించొచ్చని ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలో కుటుంబ సభ్యులతో కలిసి దేవినవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన మండపంలో ప్రతిష్ఠించిన అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. మండప నిర్వాహకులు నీలం మధును సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

◆ **సునీత లక్ష్మారెడ్డి పరామర్శ**

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని దౌల్తాబాద్ సర్పంచ్ కొన్యాల వెంకటేశం, ఎంపీటీసీ కొన్యాల సతీష్ తండ్రి రాములు (80)గుండెపోటుతో శనివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీత లక్ష్మారెడ్డి ఆదివారం వెంకటేశం, సతీష్‌ను పరామర్శించి సంతాపం తెలిపారు. సంతాపం తెలిపినవారిలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి హకీం, బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు ఉన్నారు.

◆ **21న బతుకమ్మ పండగ**



రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని రాయసముద్ర చెరువు కట్ట పోచమ్మ గుడి వద్ద ఆదివారం పాత రామచంద్రాపురం గ్రామ పెద్దలు, మాజీ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ కుమార్ గౌడ్, మాజీ వార్డు సభ్యుడు మోహన్ రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 21వ తేదీన బతుకమ్మ పండగ, 23న దసరా పండగల జరుపుకునేందుకు తేదీలను ప్రకటించారు.

◆ **గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుదాం**



జిన్నారం(పటాన్‌చెరు): త్వరలో జరగనున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుదామని, అన్ని వర్గాల సంక్షేమం కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని బొల్లారం మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పలువురు బీజేపీ నాయకులు కాటా శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డె కృష్ణ, ఎంపీపీ రవీందర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **బతుకమ్మ సంబురాలు**



జిన్నారం(పటాన్‌చెరు): బతుకమ్మ ఉత్సవాలను ఆయా గ్రామాల్లో మహిళలు జరుపుకుంటున్నారు. ఆదివారం జిన్నారంలోని గిరిజన గురుకుల పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులు బతుకమ్మ ఆడారు. బతుకమ్మ పండగ ప్రాముఖ్యతను విద్యార్థినులకు వివరించారు.

◆ **అమ్మవారికి పూజలు**

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని ఆయా గ్రామాల్లో మండపాల్లో కొలువైన దుర్గామాతకు భక్తులు పూజలు చేస్తున్నారు. ఆదివారం బొల్లారం మున్సిపల్ పరిధిలో నిర్వహించిన పూజలకు కౌన్సిలర్ చంద్రారెడ్డి హాజరయ్యారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

◆ **బీఆర్ఎస్‌లో చేరిక**

పటాన్ చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ మరింత అభివృద్ధి పథంలో సాగాలంటే సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పార్టీలో చేరిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చాకలి నరసింహకు పార్టీ కండువా కప్పి ఆత్మీయ స్వాగతం పలికారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కృష్ణ, కల్పన ఉపేందర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు తల్లారి రాములు, యునస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొల్లూరి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రవల్లిక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

◆ **సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద**

సదాశివపేట(సంగారెడ్డి): సాంకేతిక కారణాల సాకుతో ప్రభుత్వం టెట్, గ్రూప్ 2 పరీక్షలను వాయిదా వేయడం వల్లే మానసిక క్షోభకు గురై ఆత్మహత్య చేసుకున్న ప్రవల్లిక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పి.వినోద డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణ పరిధిలోని సుందరయ్య నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. టెట్, గ్రూప్ 2 పరీక్షలను ప్రభుత్వం వాయిదా వేయడంతో భవిష్యత్‌లో తనకు ప్రభుత్వ ఉద్యోగం రాదని వరంగల్‌కు చెందిన ప్రవల్లిక ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. ప్రవల్లిక కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

◆ **ఉచిత వైద్య శిబిరం**



జహీరాబాద్ టౌన్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆదర్శ విద్యాలయంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 150 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్, జహీరాబాద్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

◆ **మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం**

రాయికోడ్(అందోల్): మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లను ఆదివారం సన్మానించారు. మునిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చేవెళ్ల విజయలక్ష్మి నియమితురాలు కావడంతో ముదిరాజ్ సంఘం నేతలు ఆమెను ఘనంగా సన్మానించారు.

◆ **నేడు, రేపు ఐడీబీఐ లోన్‌మేళా**

సంగారెడ్డి: ఐడీబీఐ సంగారెడ్డి బ్రాంచ్‌లో అక్టోబర్ 16, 17వ తేదీల్లో లోన్ మేళా నిర్వహిస్తుందని ఆదివారం అధికారులు తెలిపారు. ఈ మేళాలో హౌసింగ్, మార్టిగేజ్, పర్సనల్, కారు, ఎడ్యుకేషన్ తదితర రుణాలు అందిస్తుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400